# తెలుగు పులి

ద్వాపర చెంగల్వ రాయుడు గారు పదిమంది మా వాళ్ళను ఆవాళ పొద్దున్నే రప్పించారు.

రాయుడు గార్కి తెలుగు పత్రిక ఒకటి షురూ చెయ్యాలని ఆలోచన కల్గిందట. ఆ విషయమై సంప్రదించాలని అందర్నీ రమ్మన్నారు.

ద్వాపర రాయుడుగారు మా అందరి కన్నా పదేళ్ళ ముందుగా అమెరికా వచ్చారు. కంప్యూటర్ల ఎసెంబ్లీ ఫ్యాక్టరీ ఒకటి, విటమిను బిళ్ళలు తయారుచేసే ఫ్యాక్టరీ ఒకటి, నాలుగైదు వాసికిన్‌క్లినిక్సు పదో పరకో ఫాస్ట్ ఫుడ్ హోటళ్ళు, అవి కాక 'ఇంపోర్టు - ఎక్స్‌పోర్టు వ్యాపారం, అమెరికాలో ఇచ్చే డాలర్లకు ఇండియాలో రూపాయలిచ్చే వర్తకం ఇలా రాయుడు గారి వాణిజ్య వృక్షం తాలూకు వేళ్ళు హిందూ మహా సముద్రం, అట్లాంటిక్ సింధువు చొచ్చుకుంటూ పోయి గుంటూరు పురంనుంచి హ్యూస్టన్ నగరం వరకు, నేపారునుంచి న్యూయార్క్ వరకు బాగా వ్యాపించాయి. వారికి క్యూ గార్డెన్స్‌లో రెండు మిలియన్ల ఖరీదు చేసే డచ్ స్టైల్ భవనం ఒకటి, ఓవర్ హెడ్‌లో నాలుగైదు మిలియన్ల ఖరీదు చేసే బీచ్ ఫ్రంట్ కోట ఒకటి, బ్రాంక్స్‌లో పేద నల్లవాళ్ళుండే 5, 6 ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్సులు యిలా చాలా వున్నాయంటారు. మాంచి హుందాగా, పకడ్బందీగా వుంటారు. ఎప్పుడూ నవ్వుతూ ప్రసన్నంగా పలకరించ గలరు. తెలుగు సంస్కారం పలక బోస్తారు, రెండు చేతులూ కలిపి నమస్కరిస్తారు. మాబోంటి వాళ్ళకు కుల పెద్దగా వ్యవహరిస్తూంటారు.

"ఏం పేరు పెడదామంటారు?" అన్నాడు మా నల్లాన్ చక్రవర్తుల నరసింహాచారి.

'తెలుగు పులి' అన్నారు రాయుడు గారు.

'బాగుంది కొత్తగా వుంది' అన్నాం అందరం.

'ఉత్తర అమెరికాలోంచి వెలువడే బహుళ ప్రచారం గల ఒకే ఒక తెలుగు పత్రిక' అని కాప్షన్ వేయిద్దామా అన్నాడు కోనేరు వెంకటరావు.

"ప్రపంచ సాహిత్యానికి దీటైన తెలుగు రచనలతో వెలువడే ఏకైక తెనుగు సారస్వత, సాంకేతిక, సామాజిక చారిత్రక, భౌతిక, నైతిక, వైదిక, ఆర్థిక పారమార్థిక, గాంధర్వ..." అంటు

సియస్సీ మురళి

న్నాడు మా పత్రికుదురు పరమేశం.

"భాగుంది" అని వాడ్ని ఆపి, "పోతన వ్రాతలు వెయ్యడానికి వీల్లేదు" అన్నారు రాయుడుగారు.

"ఎందుకని?" అన్నారు జలజాస్యుల భృకుటీమూర్తి.

"పోతన విప్లవవాది కనక" అన్నారు రాయుడిగారి మనసెరిగిన కుప్పిగంతుల కారుణ్యాబాబు.

పోతన విప్లవ వాది కాదురా భాగవతం అని ఒక సంస్కృత పురాణాన్ని తేనెలాంటి తెలుగులో వ్రాసిన మహాకవి.

"పోతన భాగవతం వ్రాశాడనిమాకూ తెలుసయ్యా. రాసిందాన్ని రాజావారికి అంకితం చెయ్యనన్నాడు. అందువలన



ప్రభు ధిక్కారి అయ్యాడు. ఆ విధంగా విప్లవ వాది అయ్యాడు" అన్నారు రాయుడుగారు నవ్వుతూ.

'రాజుని గూళ' అని ఛీత్కరించాడు కూడాను" అన్నాడు నల్లపరెడ్డి బౌద్ధరెడ్డి.

"గూళ అన్నాడా? ఎందుకన్నాడు? ఎప్పుడన్నాడు? అరుస్తున్నాడు చిటిక మనసు చిట్టిబాబు.

"ఓ పద్యంలో అన్నాడు బాబూ" అన్నాడు పత్తిపుమరు.

"గూళ అంటే ఏమిటి? ఎందుకంత పెద్ద మాట అన్నాడు. వద్దు... ఇంత మంచిలో చెప్పద్దులే."

"తెలుగు డిక్షనరీ తీసుకురా" అన్నారు రాయుడు. తెచ్చిచూస్తే అందులో గూళ అనే మాట కన్పించలేదు. "నిఘంటువులో కూడా వెయ్యడానికి పనికి రాని బూతు మాటలు వాడే వాడి కవిత్వం వెయ్యాలటయ్యా" అన్నారు రాయుడు గారు.

"గూళ అంటే రాంబదు అని అర్థం చెప్పుకోవచ్చండి" అన్నాను నేనైన నిదానంవారి అగ్నిహోత్రుడ్ని.

"రాజుని రాంబందంటాడా? ఎలా పూర్కొన్నాడయ్యా ఆ రాజు"

"గురజాడ అప్పారావు కవిత్వం కూడా వెయ్యొద్దు" అన్నారు రాయుడు.

"ఏం, ఎందుకని?"

"ఆయనకి తెలుగు వాళ్ళంటే చాలా చిన్నచూపయ్యా. ఎంతసేపూ మనది వేథవాయత్నం అని తీసి పారేశాడు" అంత జితో ఊరుకున్నాడేం?

"కట్నాలూ శుల్కాలూ ఎంత కాలంగానో మన సమాజంలో గౌరవం, అంగీకారం పొందిన సాంప్రదాయాలు. అలాంటి వాటి మీద వ్యంగ్యంగా నాటకం రాశాడు. కట్న వ్యవస్థని తూర్పార బట్టాడు."

"అలాగా? ఎక్కడ సార్" చిట్టి మనసు. ...

"కన్యాశుల్కం అనే ఓ విప్లవ నాటకంలో సర్. కాకపోతే దాన్ని రష్యన్ లోకి కూడా తర్జుమా చేయించుకుని, ఆ కమీనిస్టోళ్ళంతా అంత మెచ్చుకోడం ఎందుకుట?"

"అలాంటి విప్లవ వాదుల కవిత్వం వెయ్యం" అన్నాడు చిట్టిబాబు.

"వేమన పద్యాలుకూడా వద్దయ్యా" అన్నారు రాయుడుగారు. అదేంటిసార్. వేమన పద్యాలే లేకపోతే తెలుగు కవిత్వం లేదు కదండీ. వేమన పద్యాలు పైకల్లా అనిపిస్తాయ్‌కానీ, తరచి చూస్తే అంతా మనక్షేనండి ఓటు" అన్నాడు పరమేశం ఏడుపు ముఖంతో. "చూడండి ప్రపంచంలో మనుషుల్ని ఎంత చక్కగా, నీటుగా పుణ్య పురుషులని-'పాప పురుషులని' తెలుపు - నలుపుగా ఎంత బాగా సెపరేట్ చేశాడో" అన్నాడు ఆశగా.

పోవయ్యా, బలవంతుల్ని నిందించాడు. నిందించలేదు సార్. అయినా అది సుమతీ శతకంలోనండీ, బలవంతుడ్ని కదానని అందరితో దెబ్బలాడితే చచ్చిపోతావు కనక దెబ్బలాడకు అన్నాడండి సుమతీకారుడు.

"పిరికితనం నూరిపోస్తాట్టయ్యా, ససేమిరా కుదరదు" అన్నారు రాయుడుగారు.

దాంట్లో ఓ కిటుకుందండీ. పాముందే అనుకోండి. పాముని కదానని బుసకొడ్తే చీమలు భయపడి, గత్యంతరంలేక చావు ధైర్యం తెచ్చుకుని, కట్టకట్టుకుని ఎదురు తిరిగి మీద పడి చంపచ్చు. రావిశాస్త్రి గారి 'సిపీలికం' కథలోలాగా, దాని బదులు వాటికి స్నేహితుడు లాగా నటిస్తే శుభ్రంగా వాటి పుట్టల్లో పడుకుని, అవి తీస్కొచ్చిన ఆహారం తింటూ బ్రతకచ్చు.

"పోవయ్యా నువ్వు కొత్త కొత్త వ్యాఖ్యానాలు చెయ్యొద్దు. ఏమైనా సరే వేమన దిగంబర కవుల కోవకి చెందిన వాడు, తీసెయ్."

శ్రీశ్రీ కవిత్వం ముట్టుకోవద్దు.

అదేంటిసార్ శ్రీశ్రీ అంటే "డబ్బు-డబ్బు" కదండి. మాంఛి సినిమాపాటలూ అవీ వ్రాశాట్ట అంటున్నాడు చిట్టిమనసు.

"చెప్పవయ్యా శ్రీశ్రీ గురించి" అని పత్తిపుదురుకేసి చూశారు రాయుడుగారు.

"శ్రీశ్రీ ఎందుకయ్యా పోనిద్దూ" అని దాటెయ్యబోయాడు పత్తిపుదురు.

"చెప్పయ్యా" అన్నారు రాయుడు గారు.

ఓచోట దొంగలంజ కొడుకుల సతే మెసలే, తని వ్రాశాడయ్యా.

"అంతమాట రాశాడా డోంట్ టచ్ హిమ్" అన్నాడు చిట్టిమనసు.

"మరెక్కడా-అలాంటి మాటలు అన లేదండీ" అన్నాడు బొద్దరెడ్డి.

అనాలేంటయ్యా? అసలా మనిషే ఒక అనార్కిస్టు. కుక్కపిల్లల్ని, అగ్గిపుల్లల్ని, దీనుల్ని, హీనుల్ని, పతితుల్ని, భ్రష్టుల్ని, ఆఖరికి హోమాల్లో పడేసే దర్భ గడ్డిని కూడా తిరగ పడండని ఉసికొల్పాడు పోతన్నా నే పద్దసుకోగా ఇంక శ్రీశ్రీ విషయం వేరే చెప్పాలా! ఎందుకొరికే అనవసర చర్చ.

"ఆరుద్ర?"

"డౌట్ ... ఉత్త నిరాశావాది. "నువ్వెక్కదల్చుకున్న రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు" అని రాస్తాడా.

ఎన్ని జన్మలకైనా ఈతడే నా భర్త అన్న హైందవ శ్రీమంతురాలు ఆస్తి సంరక్షణకై విడాకులదాకా విస్తరించడంలో సామంతురాలు-అంటూ సీలింగుల్లో పొలాలు చెయ్యి దాటి పోకుండా ఉపాయం చేస్తున్న డబ్బున్నవాళ్ళ తాలూకు ఆడంగుల్ని వెక్కిరిస్తాడా. మన పుస్తకంలో వద్దు. డౌట్"

'దాశరథి'

"డౌట్"

"ఫరవాలేదు సార్ - ఆయన్ని ప్రభుత్వం వాళ్ళే ఆస్థాన కవిగా వేస్కున్నారండి."

"నీకు తెలీదులే ఒద్దన్నా విను"



"సి. నారాయణరెడ్డి"

"పాస్"

అదేంటండీ ఆయన సంప్రదాయక కవిగానే ఎక్కువ ప్రశస్తం అండీ. ఎక్కడా బూతు మాటలు వాడగా వినలేదు. ఓసారెప్పుడో ఎవరో స్టూడెంట్లతో మాట్లాడుతూ మాత్రం వాళ్ళ షర్టులోళ్లో వాడే మాటగా, "తెంక (చెవిలోమాట) పోయిందని" అన్నాడంతే.

"పోవయ్యా లాక్షణికుడైనా, సాంప్రదాయికుడైనా ఎవడైనా యీ రోజుల్లో రాస్తో కూస్తో కమీనిస్టే ... ఔటన్నానా"

ఈ విధంగా ఒక్కొక్కరు చొప్పున క్రీ॥శ॥ 1900ల నుంచి, ముఖ్యంగా రష్యాలో విప్లవం జరిగిన్నాటినుంచి వ్రాసిన వాళ్ళెవ్వరూ పనికి రారని నల్ల జాబితాలో వేశారు రాయుడుగారు. పూర్వీకుల్లో పోతన, వేమన, సుమతీ కారుడు, తెనాలి రామకృష్ణుడు వద్దన్నారు. శ్రీనాధుడు, రాయలు, అనంతుడు, మాదయ, కేతన, జక్కన, తమ్మయ ఎవరైనాసరే వాళ్ల వ్రాసినవి జాగ్రత్తగా పరీక్షించి, వివాదగ్రస్తమైన అంశాలేమన్నా వుంటే తొలగించి వెయ్యాలన్నారు.

'కారే రాజులు, రాజ్యముల్ కూలవే' అంటూ లాగించడం మొదలెట్టాడు జలజాస్యుల

'అలా రాసినాయనెవరో విప్లవ వాది లాగే వున్నాడే. ఎవరూ నన్నయా?' అన్నారు రాయుడుగారు

"అది వ్రాసింది నన్నయ కాదండీ"

"తిక్కనా"

"కాదండీ"

"ఎర్రాప్రగడా"

"కాదండీ"

"పింగళి సూరన్నా?"

"కాదండి"

"ఎవరయ్యా మరి?"

"ఏమోనండీ"

"ఎవడు రాశాడో తెలీనప్పుడు, ఎందుకయ్యా గుర్తుపెట్టుకోడం?"

"ఏమో సార్...అనుకోకుండా ఆ మాటలు మాత్రం అలా లాలాజలం లాగా బయట పడ్డాయ్" అన్నాడు కృష్ణమూర్తి. "కొంపదీసి నువ్వే రాశావేంటి. ఏమయ్యా నువ్వుగాని క్రిప్టో కమ్యూనిస్టువి కావుకదా" అన్నారు రాయుడు.

అబ్బే లేదండీ నాకు వాళ్ళంటే చెప్పు నుంచి టోపీ వరకూ మండేనండీ."

"అలాంటి మాటలన్నీ పోతనదాకే అనుండాలండీ "అన్నాడు చిట్టిబాబు.

"అసలి కవిగాళ్ళందరికీ రాజుల్ని, ప్రభుత్వాల్ని, డబ్బున్న వాళ్ళనీ తిట్టే రోగం ఎందుకంటావ్" అన్నారు రాయుడుగారు.

"కాపిటలిస్టు కాలేక పోయిన భ్రష్టుడే కమ్యూనిష్టన్నట్లు చేతకానితనం అనుకుంటానండి-అవకాశవాదులండీ, అంటే ఆపర్చునిస్టు. ప్రతి ప్రభుత్వం మీదా ప్రజలకుండే అసంతృప్తిని, ఎక్జాగరేట్ చేసి, ఎక్స్ప్లాయిట్ చేసి, డబ్బులు చేస్తారనే మాటకార్లు. వీళ్ళని చూసి జడుసుకోడం అనవసరం అంటే కవిగాళ్ళ మూలాన కూలిపోయిన ప్రభుత్వాలేవీ లేవండి. నిజానికి వీళ్ళచేత బాగా విప్లవరసం నిండిన కథలూ, పాటలూ రాయించుకుని, సిన్మాలుతీసి డబ్బులు చేస్కొన్న పొగాకు శ్రీమంతులు మన గుంటూరు వాళ్ల బోల్డు మందున్నారండీ,"

"మన జాగ్రత్తలో మనం వుంటే నష్టం ఏముంటయ్యా" అని సర్వేశారు రాయుడు గారు.

ఈ విధంగా తెలుగు పత్రికని ప్రారంభించడానికి చర్చలు జరిగి చివరికి ఈ క్రింది విధంగా నిర్ణయాలు తీసొకొన్నారు.

1) తెలుగు పులికి చిట్టి మనసు సంపాదకుడుగా వ్యవహరించ గలడు
2) పత్రిక తెలుగు నాట గల ప్రభుత్వాన్ని ఎన్నడూ, ఏవిధంగానూ విమర్శించకుండా, సర్వ స్వతంత్రంగా ప్రచురించ గలరు.
3) తెలుగుకు తల్లిలాంటి భాష కనక సంస్కృతంలో ఎక్కువ ప్రచురణలు జరుగుతాయ్.
4) వ్యాపార ప్రకటనలన్నిటినీ తెలుగులో వేస్తారు.

ఈ విధంగా నిర్ణయాలు తీసుకుని, తెలుగు సంప్రదాయాల్ని జారిపోకుండా కాపాడే ఉద్దేశంతో అక్షయ ఉగాదినాడు 30 పేజీల "తెలుగు పులి" మొదటి సంచికని రాయుడిగారి ఆశీర్వాదంతో విడుదల చేశాం. అందులో విషయ సూచికని మచ్చుకు క్రింద యిస్తున్నాను.

| | |
|---|---|
| ముఖచిత్రం | గోదావరి |
| 2వ పేజీ | తెలుగు రాక్‌ఫెల్లరు శ్రీ రాయుడిగారి ఆశీర్వాదం |
| 3వ పేజీ | తెలుగునాడులో ప్రగతి పౌర సంబంధశాఖ సౌజన్యంతో |
| 4 నుంచి 17 పేజీలు | వ్యాపార ప్రకటనలు |
| 18వ పేజీ | లక్ష్మీస్తోత్రం |
| 19వ పేజీ | వెంకటేశ్వర కృప |
| 20వ పేజీ | వినాయక వ్రతకల్పం |
| 21వ పేజీ | మంగళగౌరి పూజా విధానం |
| 22వ పేజీ | -స్పినాచ్ ఆకులతో 'గోంగూర' పచ్చడి చేసొకొనే పద్ధతి. |
| 23, 24 పేజీలు | రాబోయే ఆకర్షణలు |
| 25, 26 పేజీలలో | నావి, పత్రికుదురువి, బొద్ధ రెడ్డివి, నల్లాన్ చక్రవర్తుల వాడివి బొమ్మలు వేసి, సందేశాలు ప్రకటించారు. |
| 27, 28 పేజీలలో | తెలుగు సాహిత్యం-ఒక ప్రశంస చిట్టిబాబు |
| 29, 30 పేజీలలో | "పత్రికా స్వాతంత్ర్యం దాని అవసరం" —శ్రీ రాయుడు. |

*